క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి



హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావును సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: హైకోర్టు న్యాయమూర్తి, అనంతపురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి అయిన జస్టిస్ మన్మథరావును హిందూపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం అనంతపురంలో కలిశారు. హిందూపురం కోర్టులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది సిద్దూ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని చేనేపల్లి గ్రామ శివార్లలో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.26,200 నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నీటి సంరక్షణ మన బాధ్యత



జల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం జనవిజ్ఞాన ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా కార్యదర్శి హరి మాట్లాడుతూ ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నీటి సంరక్షణ, నీటి వినియోగంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. నీటి సంరక్షచుకోవడం మన బాధ్యత అన్నారు. నీటి సంరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జోనల్ కమిటీ ఎడ్యుకేషన్ వింగ్ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, హెచ్ఎం చంద్రశేఖర్, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వందశాతం పోలింగ్ లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న స్వీప్ సమితి సభ్యులు

పావగడ: ప్రజా ప్రభుత్వాన్ని బలోపేతం చేయడంలో ఓటు హక్కు వినియోగం ప్రధాన పాత్ర పోషిస్తోంది. తాలూకా వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ జరిగేలా ఓటర్లలో అవగాహన కల్పించడానికి కాలినడక జాతా నిర్వహిస్తున్నాం' అని స్థానిక స్వీప్ సమితి అధ్యక్షుడు ఈఓ జానకీరామ్ తెలిపారు. శనివారం స్వీప్ సమితి సభ్యులు తాలూకా పంచాయతీ కార్యాలయం నుంచి శని మహాత్మ సర్కిల్ వరకూ కాలి నడక జాతా నిర్వహించారు. అనంతరం వందశాతం పోలింగ్‌కు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

వైభవంగా స్వారమ్మదేవి రథోత్సవం



పావగడ: తాలూకాలోని మద్దె, కరెక్యాతనహళ్లి గ్రామాలకు చెందిన స్వారమ్మదేవి, శంకరలింగేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

'నన్ను ఎవరూ బెదిరించలేదు'

పెనుకొండ: భూమి విషయంలో తనను ఎవరూ బెదిరించలేదని మైనార్టీ నాయకుడు నాసిర్ తెలిపారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... ఎస్ గ్రాండ్ హోటల్ పక్కన ఉన్న తమ భూమిని అమ్మకానికి పెట్టినట్లు, ఈ నేపథ్యంలోనే మంత్రి కార్యాలయం నుంచి తమకు బెదిరింపులు వచ్చినట్లు ఓ పత్రికలతో అసత్య కథనాలు రాశారన్నారు. తమను కలసిన తర్వాతనే భూమి అమ్మాలని, లేదంటే ఎలా రిజిస్ట్రేషన్ జరుగుతుందో చూద్దామంటూ అభూత కల్పనలతో వార్తను చిత్రీకరించారని చెప్పారు. ఇది పూర్తి అవాస్తవమన్నారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులను ఎవరూ బెదిరించలేదని స్పష్టం చేశారు. తాము ఆరుగురు అన్నదమ్ములు, చెల్లెల్లు ఇద్దరికీ కలిపి ఒక్కొక్కరికి 15 సెంట్ల చొప్పున భూమి ఉందని, ఎవరి రికార్డులు వారి వద్దనే ఉన్నాయన్నారు. ఆ భూమిని కూడా తాము అమ్మకానికి పెట్టలేదన్నారు. లేని విషయాన్ని మంత్రి ఉషశ్రీచరణ్‌కు ఆపాదిస్తూ పత్రికలో రాయడం న్యాయం కాదన్నారు.

సరిహద్దులో నిఘా కట్టుదిట్టం

- ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర-కర్ణాటక సరిహద్దుల్లో పోలీసుల డేగ కన్ను
- మడకశిర సరిహద్దు చుట్టూ 9 చెక్‌పోస్టుల ఏర్పాటు
- వాహనాలను జల్లెడ పడుతున్న ఇరు రాష్ట్రాల పోలీసులు
- మద్యం, డబ్బు అక్రమంగా తరలిరాకుండా చర్యలు



అగళి మండలం పీ బ్యాడిగెర చెక్‌పోస్టులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

మడకశిర: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర-కర్ణాటక సరిహద్దుల్లో ఇరు రాష్ట్రాల పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. వచ్చే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పరం సహకరించుకుంటూ సరిహద్దుల్లో తనిఖీలను ముమ్మరం చేశారు.

పరస్పర సహకారంతో ముందుకు...

మడకశిర నియోజకవర్గానికి నాలుగు దిక్కులా కర్ణాటక సరిహద్దు ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం, డబ్బు తరలిరాకుండా అడ్డుకట్ట వేయడానికి ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహకారంతో తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా కర్ణాటకలో పార్లమెంట్, ఏపీలో పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కర్ణాటకలో మొదటి విడత పార్లమెంట్ ఎన్నికలు ఏప్రిల్ 26న, రెండో విడత పార్లమెంట్ ఎన్నికలు మే 7న జరుగనున్నాయి. అదే విధంగా ఏపీలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో మే 13న జరుగనున్నాయి. కర్ణాటకకు చెందిన చిత్రదుర్గ, తుమకూరు పార్లమెంట్ స్థానాలు మడకశిర నియోజక వర్గానికి ఆనుకుని ఉన్నాయి. ఈస్థానాలకు ఏప్రిల్ 26న ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆంధ్ర సరిహద్దులో కర్ణాటక పోలీసులు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేశారు. అదే విధంగా మడకశిర పోలీసులు కూడా సరిహద్దులో 9 చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ప్రధానంగా అగళి మండలంలో పీ బ్యాడిగెర, రొళ్ల మండలంలో పిల్లిగుండ్లు, మడకశిర మండలంలో యూ.రంగాపురంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. మిగిలిన కర్ణాటక సరిహద్దులోని ఆలూడి, ఇటికేపల్లి, విరుప సముద్రం తదితర ప్రాంతాల్లో కూడా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ చెక్‌పోస్టుల్లో 24 గంటలూ తనిఖీలు చేస్తున్నారు. అటు కర్ణాటక పోలీసులు, ఇటు ఆంధ్ర పోలీసులు చెక్‌పోస్టుల్లో వాహనాల రాకపోకలపై గట్టి నిఘా ఉంచారు. ప్రధానంగా కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తరలివచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. అదే విధంగా పెద్ద ఎత్తున నగదు కూడా ఎన్నికల నేపథ్యంలో తరలివచ్చే అవకాశం ఉండడంతో అన్ని వాహనాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆయా చెక్‌పోస్టులను పెనుకొండ డీఎస్పీ బాజిజాన్ సైదా కూడా ఎప్పకప్పుడు వచ్చి పరిశీలన చేస్తున్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

నియోజకవర్గంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి ఈసీ అన్ని చర్యలు తీసుకుంటోంది. నియోజకవర్గంలో 24 సమస్యాత్మక గ్రామాలను పోలీసులు గుర్తించారు. ఎన్నికల్లో ఈ గ్రామాల్లో సమస్యలు తలెత్తే అవకాశం ఉండడంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ గ్రామాల్లో ఉండే రౌడీషీటర్లపై కూడా నిఘా పెట్టారు. క్రిమినల్స్ కదలికలపై కూడా నిఘా ఉంచారు. గతంలో వివిధ ఎన్నికల కేసుల్లో ఉన్న వారిపై కూడా పోలీసులు నిఘా పెట్టారు.

మద్యం, నగదుకు అడ్డుకట్ట



ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా మద్యం, నగదు అక్రమంగా తరలిరాకుండా అడ్డుకట్ట వేస్తున్నాం. ఇందులో భాగంగానే సరిహద్దులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేస్తున్నాం. సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టాం.

– రాజ్‌కుమార్, రూరల్ సీఐ, మడకశిర

పక్కాగా కోడ్ అమలు



నియోజకవర్గవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలుపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. అన్ని రాజకీయ పార్టీల కదలికలపై నిఘా పెట్టాం. ఎన్నికల కోడ్ పాటించని పార్టీలపై చర్యలు తీసుకుంటాం. ప్రచారం, సభలు, ర్యాలీల నిర్వహణకు అనుమతి తీసుకోవాలి. లేకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– గౌరీశంకర్‌రావు, ఆర్‌ఓ, మడకశిర

ప్రతి చెక్‌పోస్టుకూ రవాణా ఇన్‌స్పెక్టర్

హిందూపురం అర్బన్: జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్, రవాణాశాఖ, సెబ్, వాణిజ్య, ఆదాయ పన్నుల శాఖ అధికారులు సంయుక్త చర్యలు చేపట్టారు. రవాణాశాఖ డీటీసీ కరుణసాగర్‌రెడ్డి జిల్లా నోడల్ ఆఫీసర్‌గా పర్యవేక్షిస్తున్నారు. ఆయన పర్యవేక్షణలో కొడికొండ, తూమకుంట చెక్‌పోస్టుల వద్దే కాకుండా జిల్లాలో ప్రధాన తనిఖీ కేంద్రాలు , మొబైల్ స్క్వాడ్‌లకు సంబంధించి నియోజకవర్గానికి ఒక రవాణా ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో పాల్గొంటున్నారు. వారి వెంట హోంగార్డులు సైతం ఉంటారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఎన్నికల విధుల్లో భాగంగా చెక్‌పోస్టుల్లో ఎక్కడిక్కడ ఇన్‌స్పెక్టర్లను నియమించాము. వారి పర్యవేక్షణలో తనిఖీలు జరుగుతున్నాయి. అక్రమంగా మద్యం, డబ్బు, విలువైన సామగ్రి, వస్తువులు తరలిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తాం. పరిమితికి మించి జనాన్ని వాహనాల్లో తరలించినా, వాహనాలకు అనుమతులు లేకపోయినా స్వాధీనం చేసుకుంటాం.

– కరుణసాగర్‌రెడ్డి, డీటీసీ, హిందూపురం

నేడు మంత్రి పర్యటన

పెనుకొండ: రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖామంత్రి ఉషశ్రీ చరణ్ ఆదివారం ఉదయం 7 గంటలకు పట్టణంలోని 8వ వార్డులో, సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని 18వ వార్డులో పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలన్నారు.

నేడు సోషల్ మీడియా కోఆర్డినేటర్ల సమావేశం

పెనుకొండ: పట్టణంలోని మంత్రి ఉషశ్రీ చరణ్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. నియోజకవర్గంలోని సోషల్ మీడియా కోఆర్డినేటర్లు సమావేశానికి తప్పక హాజరుకావాలన్నారు.

రేపటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

మడకశిరరూరల్: పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకుని 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు గుండుమల ప్రభుత్వ పాలిక్లినిక్ కళాశాలలో అనుభవం ఉన్న అధ్యాపకులతో సోమవారం నుంచి 24వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు. స్టడీ మెటీరియల్‌ను కూడా అందిస్తామన్నారు. శిక్షణ తర్వాత పాలిసెట్ నమూన పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. మడకశిర పట్టణం, పరిసర గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9492660993, 9866631405 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

లేపాక్షి: లేపాక్షిలోని మహాత్మాజ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌పై అతిథి అధ్యాపకులు, విద్యార్థులు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్, కర్నూలు రీజియన్ ఏజీఎంకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈనెల 26న కళాశాల ప్రార్థన సమయంలో ప్రిన్సిపాల్ విద్యార్థుల సమక్షంలో అతిథి అధ్యాపకులను అసభ్య పదజాలంతో దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఓ వర్గం విద్యార్థులను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటుతో చంద్రబాబుకు బుద్ధిచెప్పండి



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

- మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పొత్తులతో ప్రజల ముందుకు వచ్చే పార్టీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ అన్నారు. శనివారం పెనుకొండ మండలంలోని నాగలూరు, సత్తారుపల్లి, అడదాకులపల్లి, మరువపల్లి, కురుబవాండ్లపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీలతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ.. కేవలం ఎన్నికల కోసం మాత్రమే పొత్తు పెట్టుకుంటున్న పార్టీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ముఖ్యమంత్రి కుర్చీపై ఉన్న మమకారం ప్రజలపై లేదని మండిపడ్డారు. 2014 ఎన్నికలకు ముందు 600 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేసిన నీచ చరిత్ర చంద్రబాబుకు ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే నన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టిన చరిత్ర చంద్రబాబుదని విమర్శించారు. ఓటుతో చంద్రబాబు అండ్ కోకు బుద్ధి చెప్పాలన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబు, సర్పంచ్ నాగరాజు, అలివేలమ్మ, నాగమూర్తి, నాయకులు సుధాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వైశాలి, జయశంకరరెడ్డి, నారాయణయాదవ్, గోపాల్‌రెడ్డి, కొండలరాయుడు, చెన్నకేశవులు, రత్నాలు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

వైఎస్సార్‌సీపీలో చేరిక

పెనుకొండ మండలంలోని మావటూరుకు చెందిన నాలుగు కుటుంబాలు, అడదాకులపల్లి, మరువపల్లికి చెందిన పది కుటుంబాలు మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ చేరాయి. వారందరికీ ఉషశ్రీచరణ్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

'ఆరోపణలు నిరూపించకపోతే పరువు నష్టం దావా వేస్తా'

పావగడ: ఎవరితోనైనా డబ్బులు వసూలు చేశానని నిరూపించాలని, అలా నిరూపిస్తే శిక్షకు సిద్ధమని, లేకపోతే తనపై అసత్య ఆరోపణలు చేసిన రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకరప్పపై కోర్టులో పరువు నష్టం దావా వేస్తానని స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుమకూరు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సభలో పూజారప్ప అధికారుల నుంచి డబ్బులు వసూలు చేశాడని శంకరప్ప ఆరోపణ చేశారు. ఈ నేపథ్యంలో శంకరప్పపై పూజారప్ప మండిపడ్డారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- ప్రచారంలో హిందూపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక



చిలమత్తూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

లేపాక్షి/చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ముందుగా లేపాక్షి మండలంలోని నాయనిపల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ ఇచ్చిన మాట తప్పకుండా సీఎం వైఎస్ జగన్ పేదలను ఆదుకునేందుకు హామీలను అమలు చేశారన్నారు. నవరత్నాలతో పేదల ఇళ్లలో వెలుగులు నింపారన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

హిందూపురంలో ఒక్కసారి వైఎస్సార్‌సీపీని గెలిపించండి. పట్టణంతో పాటు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తాం' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక అన్నారు. శనివారం ఆమె చిలమత్తూరు మండలంలోని దేమకేతేపల్లి, తమ్మినాయనిపల్లి, దేమకేతేపల్లి ఎస్సీ కాలనీ, బ్రహ్మేశ్వరంపల్లి , గాద్రాళ్లపల్లి, ఓబుళాపురం, కొర్లకుంట , యగ్నిశెట్టిపల్లి, వై గొల్లపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ ఎన్నికల సమయంలో తప్ప ఎప్పుడూ నియోజకవర్గంలో కనిపించిన దాఖలాలు లేవన్నారు. తాను స్థానికంగా ఉండి ప్రజలందరి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. తమ్మినాయనపల్లి గ్రామ ప్రజలు రోడ్డు వేయాలని కోరారు. దీనికి దీపిక స్పందిస్తూ ఎన్టీఆర్ కాలం నుంచి గ్రామానికి రహదారి వేస్తామంటూ బూటకపు హామీలిచ్చి మోసం చేశారని, తాము అలా కాదని రూ.7 లక్షలు వెచ్చించి గ్రావెల్ వేసి తాత్కాలిక ఉపశమనం కలిగించాన్నారు. ఎన్నికలు ముగిసిన రెండు నెలల్లోపు రహదారిని పూర్తిచేసి మాట నిలబెట్టుకుంటామన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి నాయకురాలు మధుమతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, పార్టీ పరిశీలకుడు రాజారెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు నారాయణస్వామి, రాజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మారుతీరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆదినారాయణ, సర్పంచులు ఆదినారాయణ, ఈడిగ తిరుమలేష్, సంధ్య, వైస్ ఎంపీపీ లీలావతి, మాజీ సర్పంచ్ తిప్పన్న, అంజినప్ప సీనియర్ నేతలు రామకృష్ణారెడ్డి, మాజీ మండల కన్వీనర్లు సదాశివరెడ్డి ,మద్దిపి లక్ష్మీనారాయణ, లక్ష్మిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు యాదవ్, నాగరాజు, నయీముల్లా, షాకీర్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడిగెనహళ్లిలో ఘర్షణ

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లికి చెందిన మితిలేష్‌యాదవ్‌కు ఆయన మేనత్త జయశ్రీ , ప్రసన్నకుమార్ దంపతులకు మధ్య ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి తగదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో మితిలేష్ యాదవ్‌పై జయశ్రీ , పవన్‌తో పాటు మరోఇద్దరు దాడిచేసి గాయపరిచారు. వెంటనే అతన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి మితిలేష్ యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటేశులు తెలిపారు.

నేడు మానేపల్లిలో ప్రచారం

లేపాక్షి: మండలంలోని మానేపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దీపిక ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి తెలిపారు.

పరామర్శ

అగళి: మండల పరిధిలోని మధూడి సర్పంచ్ శివకుమార్ పెద్దనాన్న హనుమంతప్ప మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప శనివారం హనుమంతప్ప భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని లేపాక్షి ఆలయం కమిటీ చైర్మన్ కరణం రమానందన్, చోళసముద్రం ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్, ఎన్ఆర్ఐ కేశవమూర్తి తెలిపారు. అమ్మవారి విగ్రహ పునఃప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో సందడిగా జరిగింది. 1986–90 మొదటి బ్యాచ్ చెందిన ఈఈఈ డిప్లొమా విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి మధురానుభూతులను వారి గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు.

ఆత్మీయ సమావేశానికి తరలిరండి

రొళ్ల: మడకశిర నియోజకవర్గానికి చెందిన వారై బెంగళూరులో నివాసం ఉన్న వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులతో ఆదివారం బెంగళూరులో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నాగసంద్ర మెట్రోస్టేషన్ సమీపంలోని మాజీ ఎమ్మెల్యే మంజునాథ్ ఆఫీసు దగ్గర వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నియోజకవర్గం పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, మడకశిర ఎన్నికల అబ్జర్వర్ మల్లు ప్రసాద్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తదితరులు హాజరవుతారన్నారు.

బ్యాలెట్ నమూనా ఏర్పాటు

హిందూపురం అర్బన్: ఓటర్లకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ హిందూపురం ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయ ఆవరణంలో బ్యాలెట్ నమూనా బోర్డు ఏర్పాటు చేయించారు. బోర్డులో అభ్యర్థుల చివర నోటా ఉండనుంది. అక్కడి సిబ్బంది కార్యాలయం వద్దకు వచ్చే వారికి అవగాహన కల్పిస్తున్నారు.

ఘనంగా 'రన్ ఫర్ జీసస్'

హిందూపురం/మడకశిర రూరల్: హిందూపురం, మడకశిర పట్టణాల్లో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చీల నుంచి క్రైస్తవులు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ప్రపంచంలో శాంతి నెలకొనాలని పాస్టర్లు ప్రార్థనలు చేశారు.



మడకశిర సీఅండ్ఐజీఎం చర్చి ముందు మానవహారంగా ఏర్పడిన క్రైస్తవులు



హిందూపురం: చర్చి నుంచి ర్యాలీగా బయలు దేరుతున్న క్రైస్తవులు